
# 'తోడు' దొంగ

జె. శ్యామల



కథ

"అరె కృష్ణారావ్!" ఒక్కసారిగా ఆశ్చర్యంగా నోరు తెరిచింది వినీల.

"ఎవరతను, ఎందుకంత ఆశ్చర్యం?" తన ఆశ్చర్యం అర్థంకాక నేను ప్రశ్నిస్తూ ఉండగానే బస్ అమీర్‌పేట స్టాప్ నుంచి కదిలింది.

వినీల ఆశ్చర్యం నుంచి ఇంకా పూర్తిగా తేరుకోలేదు. బలవంతంగా మామూలవుతూ " కృష్ణారావంటే మా ఊళ్ళో సుజాత భర్త. అతను ఇల్లు వదిలి వెళ్ళి మూడేళ్లు దాటింది. పాపం సుజాత ఎన్ని కష్టాలు పడిందో. నాకసలు తోచలేదు. బస్ దిగి వెళ్ళి అతనితో మాట్లాడితే ఎలా ఉంటుందో. పోనీ వచ్చే స్టాప్‌లో దిగి వెనక్కి వెళ్దామా?" అంది వినీల.

"నువ్వు నాక్కొంచెం కూడా అర్థం కావటంలేదు. నీకతనితో బాగా పరిచయముందా. నువ్వు వెళ్ళి ఏమని మాట్లాడతావు? మనం బయల్దేరిన పనేమిటి? మానస పెళ్ళికి మనం టైముకు చేరుకోవద్దా. అదసలు ఒకరోజు ముందు రమ్మంటే మనం ఇప్పుడు బయల్దేరాం. వనస్థలిపురం ఇక్కడ ఉందనుకుంటున్నావా?" అన్నాను.

"నిజమే.' నాకతనితో పరిచయమేమీ లేదు. వెళ్ళి మాట్లాడటం కూడా కష్టమైన పనే. అయినా లేటుగా వెళితే మానస ఈజన్మలో మనల్ని క్షమించదు" అంది.

ఆ తర్వాత పెళ్లికి వెళ్ళటం... ఆ హడావుడిలో కృష్ణారావ్ గురించి మరిచిపోయామనే చెప్పాలి.

ఆ తర్వాత వినీల ఊరు వెళుతుంటే స్టేషన్‌కు వెళ్ళాను. ట్రెయిన్‌కు ఇంకా అరగంట టైముంది. "కృష్ణారావు కథేమిటో నాకు చెప్పనేలేదు" అడిగాను కుతూహలంగా.

"అదా. సుజాత చాలా మంచి అమ్మాయి. సుజాతతో పెళ్ళయ్యే నాటికి కృష్ణారావ్ ఏదో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండేవాడు. కొన్నాళ్ళు బాగానే ఉన్నారు. వెంటవెంటనే ఇద్దరు పిల్లలు పుట్టారు. కష్టపడి పని చేయటమంటే కృష్ణారావుకు గిట్టదట. తరచు ఆఫీస్‌కు ఎగనామం పెడుతూ, దొరికిన చోటల్లా అప్పులు చేస్తూ గడిపాడు. అప్పుల వాళ్ళ వత్తిడి ఎక్కువకాగానే అర్ధాంతరంగా అంతర్ధానమయ్యాడు. అత్త, మామ, పెళ్ళయితే అబ్బాయి కుదురుగా ఉంటాడనుకున్నామనీ, సుజాత సరిగా అదుపు చేయకపోవటం వల్లే కొడుకు ఇల్లు విడిచి వెళ్ళే పరిస్థితి వచ్చిందని ఎదురు సాధించారట.

"పేపర్లో ప్రకటన ఇవ్వలేదా?" అడిగాను అమాయకంగా.

"పిచ్చిదాన్లా మాట్లాడకు. చిన్నపిల్లాడా తప్పిపోయాడని, కనిపిస్తే పట్టుకురండని ప్రకటించడానికి. కావాలని వెళ్ళిన చెట్టంత మనిషి గురించి ఏం ప్రకటన ఇవ్వాలి. ఇది నా అభిప్రాయంలే. వాళ్ళయితే ఊరుకోకుండా "ఎక్కడ ఉన్నా తిరిగి రా బాబూ, నిన్నెవరూ ఏమీ అనరు" అంటూ ప్రకటన ఇచ్చారటలే. అయినా లాభంలేకపోయింది. అలా అయితే అసలెందుకు వెళతాడు" ఆగింది వినీల.

"మరి సుజాత సంగతి" అడిగాను నేను.

కొన్నాళ్ళు సుజాత, అత్త,మామ దగ్గరే ఉంది. తోడికోడలు సుజాత కుటుంబం తమమీద పడి తింటోందని సూటీపోటీ మాట్లాడేదట. చాకిరీ అంతా సుజాత మీదే. సుజాత డిగ్రీ వరకు చదువుకున్న అమ్మాయి. భర్త తిరిగి రాకపోయేసరికి తన కాళ్ళమీద తానే నిలబడాలనుకుంది. అయినా ఎన్నాళ్ళనీ ఇంకొకరిపై ఆధారపడుతుంది. కంప్యూటర్ కోర్స్ చేయటానికి మామగారిని డబ్బులివ్వమని అడిగిందట. ఆయన "ఇప్పుడా దండగ కూడా ఎందుకు" అన్నాడట.

దాంతో పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్ళింది. వాళ్ళ సాయంతోనే కంప్యూటర్ కోర్స్ చేసింది. అదృష్టవశాత్తు మంచి ఉద్యోగం దొరికింది. ఇప్పుడామెకు పదివేల జీతం. కృష్ణారావు ఇల్లు విడిచి వెళ్ళాడని లబోదిబోమన్న అప్పుల వాళ్ళు అప్పుడు ఊరుకున్నా, సుజాతకు ఉద్యోగం వచ్చిందని తెలియగానే అప్పు తీర్చమని గొడవ మొదలెట్టారు. ఏం చేస్తుంది, అలాగే కొద్దిగా కొద్దిగా తీర్చేసింది. అత్తమామలు, కోడలు చదువుకుంటానని ఫీజుకు డబ్బడిగితే ఇవ్వనందుకు ఇప్పుడు బాధ పడుతున్నారట. అప్పుడప్పుడూ వచ్చి ఎంతో ప్రేమ ఉన్నట్లు నటించి, మర్యాదలు పొంది వెళుతుంటారు. " చెప్పింది వినీల.

"అలాగా. అయితే కృష్ణారావు ఇక్కడున్నాడని తెలిస్తే ఏమవుతుందో కథ" ఆసక్తిగా అన్నాను.

ఇంతలో రైలు రావటం, వినీల ఎక్కటం జరిగిపోయాయి. "అప్పుడప్పుడూ ఫోన్ చేస్తుండు" వీడ్కోలు పలికాను.

సుజాత గురించే ఆలోచిస్తూ ఇంటి ముఖం పట్టాను. ఆ అమ్మాయిని చూడకపోయినా సుజాత చుట్టూనే నా ఆలోచన పరిభ్రమిస్తోంది. వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి. జీవితంలో ఏర్పడ్డ ఒడిదుడుకుల్ని ధైర్యంగా ఎదుర్కొంది అనుకున్నాను. అదే సమయంలో నా చిన్నప్పుడు మా ఊళ్ళో జరిగిన ఓ సంఘటన గుర్తొచ్చింది. లింగమ్మ అని ఒకావిడ ఉండేది. ఆమె భర్త వ్యాపారంలో నష్టం వచ్చిందని హఠాత్తుగా ఇల్లు వదిలి వెళ్ళిపోయాడట. వాళ్ళకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దపిల్లకు నిశ్చితార్థం జరిగింది. పెళ్ళికొడుకు తరఫువారు పిల్లకు ఖరీదైన నెక్లెస్ కూడా పెట్టారు. కానీ పిల్ల తండ్రి ఎటో వెళ్ళిపోవటంతో పెళ్ళి వాయిదా పడింది. ఎన్నాళ్ళయినా ఆయన రాలేదు. వచ్చే కాస్తంత అద్దె డబ్బులతో, ఇంట్లో కాసే కూరా, నారతో ఆమె పొదుపుగా, గుట్టుగా ఇల్లు నడిపేది. అయినా కొంతకాలానికి ఆమె దగ్గరున్న కొన్ని నగలను అమ్ముకోక తప్పలేదు. పెళ్ళి సంబంధం వాళ్ళు ఇంక ఆగలేమని చెప్పి, వాళ్ళు పెట్టిన నెక్లెస్ కాస్తా తీసుకొని వెళ్ళిపోయారు. ఇల్లు గడవటానికి ఏదో ఒక పని చేయాలని నిశ్చయానికి వచ్చింది లింగమ్మ. ఆమె చదువుకున్నది కాదు. ఆమెకు తెలిసిందల్లా పాకశాస్త్రమే. అందుకే పునుగులు చేసి అమ్ముదామనుకుంది. ఓ శుభ ముహూర్తాన పునుగుల అమ్మకం మొదలెట్టింది. అదేం చిత్రమో ఆమె ఒక్క రోజు అలా అమ్మిందో, లేదో మర్నాడు ఉదయానే భర్త తిరిగొచ్చాడు.

ఇక పునుగుల వ్యాపారం ఆగిపోయింది. అప్పటి వరకు ఉదయం, సాయంత్రం ఇంటి అరుగు మీద కూర్చుని కబుర్లు చెప్పే లింగమ్మ ఆ తర్వాత ఇంట్లోంచి బయటకు రావటం తగ్గిపోయింది. చకచకా పిల్లకు మరో సంబంధం చూడటం, పెళ్ళి చేయటం కూడా జరిగిపోయాయి. హఠాత్తుగా డబ్బెలా సర్దుబాటయిందో నాకు తెలీదు. కాకపోతే ఈ సంబంధం వాళ్ళు అంత ధనవంతులు కాదని, నగలు మధ్యస్థంగా పెట్టారని అనుకోవటం నాకు గుర్తుంది. భర్త అలా వెళ్ళిపోయి మళ్ళీ వస్తే ఆమె ఫీలింగ్స్ ఏమిటో చిన్నతనం కాబట్టి నేనంతగా గమనించనూ లేదు, ఆలోచించనూ లేదు. అయినా మూడు దశాబ్దాల కిందటికీ , ఇప్పటికీ లోకంలో ఎంతో మార్పు వచ్చింది. ఆలోచనల్లో ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్ళిపోయానో అనుకుంటూ ప్రస్తుతంలోకి వచ్చాను. అదే సమయానికి స్టాప్ వచ్చిందని గుర్తించి గబగబా బస్ దిగేశాను.

** *** **

ఆ రోజు వినీల నుంచి ఫోన్. కుశల ప్రశ్నలు, ఆ మాట, ఈ మాట అయ్యాక, ఫోన్ పెట్టెయ్య బోతుండగా హఠాత్తుగా నాకు సుజాత విషయం గుర్తుకు వచ్చింది. "ఆగాగు" అన్నాను కంగారుగా.

"ఏమిటో చెప్పు" అంది నవ్వుతూ సుజాత.

"ఆఁ అదే. కృష్ణారావును హైదరాబాద్‌లో చూశానని చెప్పావా?" అడిగాను.

"ఆఁ. నే వెళ్ళేసరికి వాళ్ళ అత్త,మామ అక్కడే ఉన్నారు. కృష్ణారావుని చూశానని చెప్పగానే తల్లిదండ్రి "మా కృష్ణయ్య కనిపించాడా. ఎంత కాలమయిందో బిడ్డని చూసి, ఏం తింటున్నాడో, ఎలా ఉంటున్నాడో" అంటూ దుఃఖ పడ్డారు.

"బండిమీద అమ్ముతున్న దోసెను చక్కగా తింటున్నాడు" అని చెబుదామనుకున్నా. కానీ కంట్రోలు చేసుకున్నా. వాళ్ళ చుట్టాలెవరో అమీర్‌పేటలో ఉన్నారట. వాళ్ళకు చెపుతామని అన్నారు.

"సుజాత ఏమంది" అడిగాను ఆసక్తిగా.

"పెద్దగా ఆసక్తి చూపించలేదు. పైగా నేనా విషయం వాళ్ళ ముందు చెప్పటం ఆమెకు నచ్చినట్లు లేదు" చెప్పింది.

"క్యూరియాసిటీ కొద్దీ అడిగా. సరేలే. గుడ్‌నైట్ మరి" అన్నాను.

"వెరీ గుడ్‌నైట్" అంటూ వినీల ఫోన్ పెట్టేసింది.

** *** **

రోజులు గిరా గిరా తిరిగిపోతున్నాయి. నా రొటీన్‌లో పడి నేస్తం వినీల మాట కూడా మరిచిపోయాను. ఆ రోజు పరిటాల రవి హత్య కారణంగా ఊళ్ళో బంద్. రవాణా లేనిదే కదిలే పని లేదుకదా. అందుకే ఇంట్లో ఉండిపోయాను. వినీ గుర్తుకువచ్చింది. వెంటనే ఫోన్ చేశాను.

" బంద్ అయితే, నీకు తోచక, ఇప్పుడు గుర్తుకు వచ్చానా" అంటూ నిష్ఠూరాలాడింది.

"సారీ సారీ అన్నానుగా. ఇప్పుడు చెప్పు నీ థీసిస్ ఎంత వరకు వచ్చింది" అడిగాను.

"ముందుకు వస్తోంది, వెనక్కు వెళ్తోంది" అంది వినీల.

"అదేమిటి" అర్థం కాక అడిగాను.


"అంటే ఏముంది. నేను రాయటం. ముందుకెళ్ళింది అనుకోవటం. మా గైడ్ చూసి "అహఁ ఇలా కాదు, ఇదంతా తీసేసి అలా రాయండి" అంటూ ఏవేవో సలహాలు చెప్పటం నా పని మళ్ళీ మొదటికి రావటం.. ఇలా జరుగుతోంది" అంది.

"సరేగానీ సుజాత, కృష్ణారావుల సంగతి ఏమయింది?" అడిగాను.

"నీకింకా గుర్తుందా?" ఆశ్చర్యపోయింది వినీ.

"ఇలాటి ఇంటరెస్టింగ్ విషయాలు ఎలా మరిచిపోతాం చెప్పు. ఇంతకూ కృష్ణారావ్ సాక్షాత్కరించాడా, లేదా?" అడిగాను.

"ఆఁ వాళ్ళచుట్టాలు పట్టేశారు?" చెప్పింది.



"ఈ ఉద్యోగమే నన్ను, నా పిల్లల్నీ కాపాడింది. భర్తంటే వచ్చీ, పోయే అతిథి కాదు, కష్ట, సుఖాల్లో తోడుగా నిలిచి, నీకు, నేనున్నానని జీవితాంతం అండగా నిలిచేవాడు. కొట్టడం, తిట్టడమే మీ దృష్టిలో హింస. కానీ ఉన్న ఉద్యోగాన్ని తిన్నగా చేయకుండా, బండెడు అప్పులు చేసి సంసారాన్ని నడిసంద్రంలో వదిలివెళ్ళటం ఎంత హింసో అనుభవించిన నాకు తెలుసు. ఒక్కమాటైనా చెప్పకుండా, మమ్మల్ని నిరాధారంగా వదిలి సంవత్సరాల తరబడి మాగురించే పట్ట కుండా వెళ్ళిపోయిన మీ అబ్బాయిమీద నాకు గౌరవం ఎలా ఉంటుంది? ఎందుకు ఉండాలి?"

"ఎలా, వాళ్ళు అతణ్ణి ఇదివరకు చూశారా?" అడిగాను మళ్ళీ.

"అబ్బబ్బ నీకన్నీ సందేహాలే. చూశార్లే. అయినా వాళ్ళు ఫొటో కూడా పంపారట. చెప్పేది విను. సుజాత ఉద్యోగం వగైరా విషయాలు చెప్పగానే "నా పిల్లల్ని చూడాలనుంది" అంటూ దిగబడ్డాడట.

"అయితే ఇప్పుడు సుజాత కథ సుఖాంతమేగా" అన్నాను.

"ఇదేం సినిమా అనుకున్నావా? కనపడగానే ఆనందబాష్పాలు రాల్చి, హత్తుకుపోవటానికి. బాధ్యతను తప్పించుకుని, తన గురించి, పిల్లల గురించి కాస్త కూడా ఆలోచించకుండా వదిలి వెళ్ళిపోయిన అతను తీరిగ్గా ఇప్పుడు రావటం ఆమెకు కోపాన్ని, బాధను కలిగించింది. పోనీ లోకోద్ధరణకోసం, పదిమంది మేలుకోసం ఇంటి బాధ్యతలు విస్మరించాడన్నా క్షమించగలిగేదేమో. అందుకే అతనితో జీవితం తనకిష్టం లేదని నిర్మొహమాటంగా చెప్పింది. తనకు విడాకులు ఇవ్వకపోయినా పరవాలేదని, మరో పెళ్ళి చేసుకున్నా అభ్యంతరం లేదని, కానీ తాను మాత్రం అతనితో కలిసి జీవించటానికి ఇష్టపడనని తెగేసి చెప్పింది.

ఆ మాటలు అత్తమామలకు కోపం తెప్పించాయి. "ఏదో మనసు చెదిరి వాడు ఇల్లొదిలి వెళ్ళాడు గానీ, ఇన్నేళ్ళు వాడు మాత్రం సుఖ పడ్డాడా, వేళకు తిండి, తిప్పలు లేక మనిషి ఎలా ఉండేవాడు ఎలా అయ్యాడు. పోనీ నిన్నేనాడైనా కొట్టడం, తిట్టడం చేశాడా? తాగొచ్చి చావగొట్టే మొగుళ్ళను, భార్యను కిరసనాయిలు పోసి తగలబెట్టే మొగుళ్ళను ఎంత మందిని చూడటం లేదు. ఏదో ఇన్నాళ్ళకు ఆ దేవుడు కరుణించి వాడు ఇంటికి తిరిగొస్తే భర్త అన్న గౌరవం లేకుండా అలా మాట్లాడుతావా? ఆఉద్యోగం చూసుకునేగా నీకంత పొగరు" అన్నారు.

"అవును. ఈ ఉద్యోగమే నన్ను, నా పిల్లల్నీ కాపాడింది. భర్తంటే వచ్చీ, పోయే అతిథి కాదు, కష్ట, సుఖాల్లో తోడుగా నిలిచి, నీకు, నేనున్నానని జీవితాంతం అండగా నిలిచేవాడు. కొట్టడం, తిట్టడమే మీ దృష్టిలో హింస. కానీ ఉన్న ఉద్యోగాన్ని తిన్నగా చేయకుండా, బండెడు అప్పులు చేసి సంసారాన్ని నడిసంద్రంలో వదిలివెళ్ళటం ఎంత హింసో అనుభవించిన నాకు తెలుసు. ఒక్కమాటైనా చెప్పకుండా, మమ్మల్ని నిరాధారంగా వదిలి సంవత్సరాల తరబడి మాగురించే పట్టకుండా వెళ్ళిపోయిన మీ అబ్బాయిమీద నాకు గౌరవం ఎలా ఉంటుంది? ఎందుకు ఉండాలి?" అని ఎదురు ప్రశ్నించటంతో "కలికాలం" అని సణుక్కుంటూ వెళ్ళిపోయారు.

ఉద్యోగం, సద్యోగంలేని ఆ కృష్ణారావుకు, అతని మొదటి పెళ్లి వ్యవహారం తెలిసీ, ఏ అమాయకులో బుట్టలో పడితే తప్ప మళ్ళీ పెళ్ళి కష్టమే. కోర్టుకెక్కి, సాధించటం, లేదా పిల్లల్ని మంచి చేసుకుని, వేధించటం చేస్తాడంటావా? ప్రస్తుతానికయితే అంతా మామూలుగానే ఉంది"అంది వినీల.

"సుజాత నిజంగా గ్రేట్. వెన్నెముక ఉన్న అమ్మాయి. భర్త ఎంత కష్టపెట్టినా, ఎక్కడికి వెళ్ళినా, ఎంతకాలానికి వచ్చినా, స్వాగతాలు పలికే స్టీరియో టైప్ కాకుండా భిన్నంగా నిలిచింది.నాకు మీ సుజాతను చూడాలనుంది. మీ ఊరు వస్తే పరిచయం చేస్తావా?" అడిగాను.

"దానికేం భాగ్యం. ఇక ఉండనా మరి" అంది వినీ.

"ఒ.కే. బై." అంటూ ఫోన్ పెట్టేశాను. •